సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 21 । మార్చి । 2023



గుప్తనిధుల కోసం ఇంట్లో గోతులు

ఓ వ్యక్తి అప్పు తీర్చేందుకు డబ్బులు లేకపోవడంతో గుప్తనిధుల కోసం అన్వేషణ ప్రారంభించాడు. లంకెబిందెల కోసం ఇంటి లోపల భాగంలో 30 అడుగుల గొయ్యి తవ్వగా ఏమీ దొరకలేదు.

8లో..



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,610
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,503
3 శాతం జీఎస్టీతో	రూ.5,668
నవర (8 గ్రా)	రూ.45,344

గరిష్టం/కనిష్టం 33.6 /24.3

వాతావరణం

సోమవారం గాలిలో 68 శాతం తేమ ఉంది. మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉండొచ్చు. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

'స్పందన' పునఃప్రారంభం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు(అర్బన్‌): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ ముగియడంతో స్పందన కార్యక్రమాన్ని సోమవారం పునఃప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో నెల్లూరులోని కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్‌ కేవీఎన్‌ చక్రధర్‌బాబు, జేసీ కూర్మనాథ్‌, డీఆర్వో వెంకటనారాయణమ్మకు అర్జీలు అందజేశారు. కలెక్టర్‌ అధికారులతో మాట్లాడుతూ స్పందన అర్జీలను వారంలోపు పరిష్కరించాలన్నారు. ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ అర్జీలు రాకుండా చూడాలన్నారు. సమస్యలను పరిష్కరించలేకపోతే అందుకు కారణాలు ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు.

మూల్యాంకనంపై సూచనలు



మాట్లాడుతున్న అధికారి

నెల్లూరు(టౌన్‌): ఇంటర్మీడియట్‌ పబ్లిక్‌ పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనంపై సోమవారం నెల్లూరులోని కేఏసీ జూనియర్‌ కళాశాలలో ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు అధ్యాపకులకు సూచనలిచ్చారు. జవాబుపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి మూల్యాంకనం చేయాలన్నారు. నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. సెల్‌ఫోన్లను తీసుకెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో ఏసీఓలు గురవయ్య, వేణుగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

4,544 పొగాకు బేళ్ల విక్రయం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం వేలానికి 713 బేళ్లు రాగా వాటిలో 705 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్‌ తెలిపారు. మిగిలిన బేళ్లలో 8 నోబిడ్‌గా గుర్తించారు. మొత్తం 93,788 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.1,87,01,005ల వ్యాపారం జరిగింది. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.190, సగటున రూ.199.40 ధర లభించింది. 8 కంపెనీలు వేలంలో పాల్గొన్నాయి.

• కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి జనరల్‌ క్లస్టర్‌కు చెందిన రైతులు సోమవారం 4,136 బేళ్లను తీసుకురాగా 3,839 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్‌ తెలిపారు. 297 బేళ్లను తిరస్కరించారని తెలిపారన్నారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.184, సగటున రూ.197.79 ధర లభించింది. వేలంలో 7 కంపెనీలు పాల్గొన్నాయి.

సోమశిలలో 97.350 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 97.350 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్‌ డెల్టాకు 500, ఉత్తరకాలవకు 493, దక్షిణకాలువకు 300, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.350 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 313 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

ఇంటర్‌ పరీక్షలకు 1,031 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్‌): ఇంటర్మీడియట్‌ ప్రథమ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మ్యాథ్స్‌–ఏ, బోటనీ–1, సివిక్స్‌–1 ఎగ్జామ్స్‌ను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జనరల్‌కు సంబంధించి 28,548 మందికి గానూ 27,710 మంది హాజరయ్యారు. 838 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,800 మందికి గానూ 1,607మంది హాజరయ్యారు. 193 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కోటలోని ఏపీడబ్ల్యూ జూనియర్‌ కళాశాలలో ఓ విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ అధికారులు కేసునమోదు చేశారు.

కార్పొరేట్‌ స్కూళ్లకు పేద బిడ్డలు



పేద పిల్లలు ప్రైవేట్‌, కార్పొరేట్‌ పాఠశాలల్లో చేరి చదువుకోవచ్చు. డబ్బులిచ్చి కాదు.. ఉచితంగానే.. ఇందుకోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. వచ్చే విద్యా సంవత్సరంలో 25 శాతం మంది పేద పిల్లలకు ఒకటో తరగతిలో సీట్లను కేటాయించాలని ఆయా యాజమాన్యాలను ఇప్పటికే ఆదేశించింది. విద్యాశాఖ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే తగిన ఉత్తర్వులు విడుదల చేయడంతో ఎక్కువమందికి అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు.



నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థులు

- ఉచితంగా చదువుకునే అవకాశం
- ఒకటో తరగతిలో ప్రవేశాలు
- 25 శాతం సీట్ల కేటాయింపునకు చర్యలు
- విద్యాశాఖ అధికారుల ప్రత్యేక దృష్టి
- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు(టౌన్‌): రాష్ట్ర ప్రభుత్వం పేద పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో మనబడి నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, సీబీఎస్‌ఈ సిలబస్‌, డిజిటల్‌ తరగతులు, ఇంగ్లిష్‌ మీడియం తదితర వాటిని అమలు చేస్తోంది. ఇంకా విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్‌, ప్రైవేట్‌ పాఠశాలల్లో 25 శాతం మేర పేద పిల్లలకు ప్రవేశం కల్పించేందుకు గత ఏడాది నుంచి చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశాలకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న పిల్లలకు అర్హతలను బట్టి ఆయా ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో సీట్లు కేటాయించనున్నారు.

ముఖ్యమైన తేదీలు

- ప్రైవేట్‌, కార్పొరేట్‌ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పించాలనుకునే తల్లిదండ్రులు ఈనెల 22 నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు http://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌ చేయాలి.
- దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల వివరాలను ఏప్రిల్‌ 13 నుంచి 17వ తేదీ వరకు ఆయా సచివాలయాల్లో వెరిఫికేషన్‌ చేసి అర్హుల జాబితా ప్రకటించనున్నారు.
- ఏప్రిల్‌ 18న తొలివిడతగా లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.
- 19 నుంచి 25వ తేదీల మధ్య ప్రవేశాలను ధ్రువీకరిస్తారు.
- 29న రెండో విడత లాటరీ పద్ధతిలో అర్హుల జాబితాను ప్రకటించనున్నారు.
- ఎంపికైన విద్యార్థులు మే ఒకటి నుంచి ఐదో తేదీలోపు పాఠశాలల్లో అడ్మిషన్లు పొందాలి.
- విద్యార్థుల ప్రవేశాల కోసం ఆయా ప్రాంతాల్లో ఉండే సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

కేటాయింపు ఇలా..

ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు సంబంధించి ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4, ఇతరులకు 6, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులు, అనాథలకు 5 శాతం సీట్లను కేటాయించనున్నారు. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.1.20 లక్షలు, అర్బన్‌ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలుగా నిర్ణయించారు. ఉచితంగా ప్రవేశం పొందిన విద్యార్థులు ఎంత ఫీజు చెల్లించాలో ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం అర్బన్‌ ప్రాంతాల్లో రూ.8 వేలు, రూరల్‌ ప్రాంతంలో రూ.6,500, గిరిజన ప్రాంతాల్లో రూ.5,100గా ఉంది. స్కూళ్లకు అమ్మఒడి పథకం కింద ఫీజు చెల్లించనున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో మొత్తం 501 కార్పొరేట్‌, ప్రైవేట్‌ ప్రాథమిక పాఠశాలలున్నాయి. సాధారణంగా వాటిల్లో విద్యనభ్యసించాలంటే రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు యాజమన్యాలకు చెల్లించాలి. దీనికితోడు ప్రతి ఏటా అదనంగా 20 నుంచి 30 శాతం ఫీజును పెంచేస్తుంటారు. ఆ విద్యాసంస్థల్లో పిల్లల్ని చదివించేందుకు చాలామంది తల్లిదండ్రులు అప్పులు చేస్తుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని కఠినంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. ప్రతి ఏటా జిల్లాలో ప్రైవేట్‌, కార్పొరేట్‌ పాఠశాలల్లో 12 వేల మందికి పైగా పిల్లలు ఒకటో తరగతిలో ప్రవేశం పొందుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఆయా యాజమాన్యాలు 25 శాతం సీట్లు కేటాయిస్తే 3 వేలమందికి పైగా పేద పిల్లలకు చదువుకునే అవకాశం దక్కుతుంది.

జిల్లాలో ప్రైవేట్‌, కార్పొరేట్‌ స్కూళ్లు : **501**

దరఖాస్తు చేసుకునేందుకు గడువు : **వచ్చే నెల పదో తేదీ వరకు**

ఎంతమందికి అవకాశం ఉండొచ్చంటే.. : **3** వేలకు పైగా

వివరాల కోసం ఫోన్‌ చేయాల్సిన నంబర్‌ : **14417** (టోల్‌ఫ్రీ)

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతి ప్రైవేట్‌, కార్పొరేట్‌ పాఠశాలల్లో గతేడాది ఎన్‌రోల్‌మెంట్‌ ఆధారంగా పేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయిస్తాం. ప్రవేశాల కోసం బుధవారం నుంచి వివరాలను నమోదు చేయాలి. బడుగు, బలహీనవర్గాలకు చెందిన పిల్లలు, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలకు ఆయా పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించనున్నారు. సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ సిలబస్‌ గల పాఠశాలల్లో అడ్మిషన్‌ కోరుకునే విద్యార్థులకు 2024 ఏప్రిల్‌ ఒకటో తేదీ నాటికి ఐదేళ్ల వయసు నిండి ఉండాలి. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్‌ చేసేందుకు అవకాశం కల్పించారు. ఆయా వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్‌ ఆధారంగా సీట్లు కేటాయిస్తాం. ఈ అవకాశాన్ని పేద విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– గంగాభవాని, డీఈఓ

మంచి నిర్ణయం



పేద, మధ్య తరగతి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. 25 శాతం సీట్ల కేటాయింపుతో కార్పొరేట్‌ పాఠశాలల్లో తమ పిల్లలు చదవాలన్న కొందరు తల్లిదండ్రుల కల నెరవేరుతుంది. విద్యాహక్కు చట్టాన్ని జిల్లా అధికారులు పక్కాగా అమలు చేసి పేద పిల్లలకు అడ్మిషన్‌ పొందేలా చూడాలి.

– జీవీ ప్రసాద్‌, నెల్లూరు

ముందు తమ్ముడు.. తర్వాత అన్న!

తెలుగుదేశం పార్టీలో చేరేందుకు కోటంరెడ్డి బ్రదర్స్‌ రంగం సిద్ధం చేసుకుంటున్నారు. వారి రాకను తెలుగు తమ్ముళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా లాభం లేకుండాపోయింది. తొలుత తమ్ముడు గిరిధర్‌రెడ్డి ఆ పార్టీలో చేరనున్నారు. తర్వాత అన్న శ్రీధర్‌రెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకుంటారని తెలిసింది. బ్రదర్స్‌ను తీసుకోవద్దని డిమాండ్‌ చేసిన అబ్దుల్‌ అజీజ్‌ ఇప్పుడు తన గమ్యం ఏమిటో తెలియక బాధలో మునిగిపోయారు.

- ఈనెల 24న టీడీపీలోకి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి
- కొంత కాలం తర్వాత శ్రీధర్‌రెడ్డి చేరిక?
- అజీజ్‌ రాజకీయ భవిష్యత్‌ అంధకారమే
- వ్యతిరేకించిన నేతలు కూడా సైలెంట్‌



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



గిరిధర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు రూరల్‌ నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీలో సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. కోటంరెడ్డి బ్రదర్స్‌ని తీసుకోవద్దని అధిష్టానానికి స్థానిక నాయకులు ఎంత మొర పెట్టుకున్నా వినలేదు. గిరిధర్‌రెడ్డి టీడీపీ కండువా కప్పుకొనేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. దీంతో తొలి నుంచి పార్టీలో ఉన్న నాయకులు ఆలోచనలో పడిపోయారు.

రాష్ట్రంలో తెలుగుదేశం పరిస్థితి ఏ మాత్రం బాగోలేదు. అంపశయ్యపై ఉన్న ఆ పార్టీని బతికించేందుకు చంద్రబాబు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పాత నేతలకు మొండిచేయి చూపించేందుకు వెనకాడరని ప్రచారం ఉంది. గెలుపే లక్ష్యంగా బడాబాబులను రంగంలోకి దించాలని అధిష్టానం నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే టీడీపీ కోటంరెడ్డికి గాలం వేసింది. ఇందుకోసం కోటంరెడ్డి బ్రదర్స్‌ రాకను వ్యతిరేకిస్తున్న అబ్దుల్‌ అజీజ్‌తో పాటు పలువురు రూరల్‌ నియోజవర్గ నాయకులకు చెక్‌ పెట్టి పక్కన పెడుతున్నట్లు సమాచారం.

ఇద్దరూ కలిసి..

అబ్దుల్‌ అజీజ్‌ తనను మేయర్‌ను చేసి రాజకీయంగా భవిష్యత్‌ కల్పించిన తల్లిలాంటి వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరారు. ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని దారుణంగా తిట్టి రాజకీయ పబ్బం గడుపుకొంటున్నారు. ప్రస్తుతం ఆ పార్టీలో నెల్లూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడిగా నెల్లూరు రూరల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చెందిన అజీజ్‌ మొదటి నుంచి రూరల్‌ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో లోపాయికారి ఒప్పందంతో ముందుకు వెళ్తున్నారు. నాలుగేళ్ల కాలంలో ప్రెస్‌మీట్లు పెట్టి కోటంరెడ్డిపై ఏదో ఒకటి మాట్లాడేవారు. అయితే ఎప్పుడు కూడా ఎమ్మెల్యే కోటంరెడ్డి అజీజ్‌ను ఒక్కమాట కూడా అనలేదు. దీనిని బట్టే వారి మధ్య స్నేహం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే శ్రీధర్‌రెడ్డి రాజకీయ వ్యూహంలోనే అజీజ్‌ను రాజకీయ పావుగా వాడుకున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీడీపీతో సన్నిహితంగా ఉంటూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రూరల్‌ టికెట్‌ ఆశిస్తున్న ఆయన అజీజ్‌కు వెన్నుపోటు పొడిచాడని కొందరు తెలుగు తమ్ముళ్లు బహిరంగంగానే అంటున్నారు. అజీజ్‌ తేరుకొనే సరికి ఆయన రాజకీయ భవిష్యత్‌ అంధకారంలోకి వెళ్లిపోయింది.

అధిష్టానమే కారణం?

కోటంరెడ్డి ఫోన్‌ ట్యాపింగ్‌ డ్రామా చేసి వైఎస్సార్‌సీపీకి దూరమయ్యారు. నెల్లూరు రూరల్‌ నియోజకవర్గంలో ఆయన ఎన్నో అరాచకాలు చేశాడని ఆరోపణలున్నాయి. కొందరికి జీతాలిచ్చి దారుణాలు చేయించాడని, తమ నేతలను టార్గెట్‌ చేసి దాడులకు పాల్పడ్డాడని టీడీపీ చాలాకాలం విమర్శించింది. తనకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని ఎమ్మెల్యే కొట్టించాడని తెలుగు తమ్ముళ్లు అనేక సందర్భాల్లో వాపోయారు. ఇంకా ల్యాండ్‌ సెటిల్‌మెంట్లు, దందాలతో శ్రీధర్‌రెడ్డి రూ.కోట్లు అక్రమంగా సంపాదించాడని ప్రచారం ఉంది. సింహపురి రాజకీయ చరిత్రలోనే ఇంత అరాచకంగా వ్యవహరించిన ఎమ్మెల్యేను చూడలేదని విశ్లేషకులు చెబుతున్నారు. కోటంరెడ్డి అరాచకాలు చేస్తున్నాడని నిన్న మొన్నటి వరకు నోరు చించుకున్న టీడీపీ నేతలు ఇప్పుడు నోటికి తాళం వేసుకున్నారు. కోటంరెడ్డి బ్రదర్స్‌ వస్తే సహించమని అధినేత చంద్రబాబుకు హుకుం జారీ చేసిన వారు ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్నారు. దీనికి కారణం అధిష్టానమేనని చెబుతున్నారు. నియోజకవర్గంలో వ్యూహాత్మకంగా టీడీపీని ఖతం చేసిన వ్యక్తికే రాచబాట వేసి పార్టీలోకి ఆహ్వానించడాన్ని తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. అయితే వారికి నోరు తెరిచి మాట్లాడలేని పరిస్థితి ఉంది.

బూతులు మాట్లాడిన నోటితోనే..

అధికారంతో విర్రవీగి అన్నివర్గాల వారిపై బూతులతో చెలరేగిపోయిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రస్తుతం కష్టకాలంలో ఉన్నానని సుద్దులు చెప్పడంపై రూరల్‌ నియోజకవర్గ ప్రజలు విస్తుపోతున్నారు. ఎమ్మెల్యే బూతుపురాణాలు సోషల్‌ మీడియాలో హల్‌చల్‌ చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఆ పాత ఆడియో రికార్డింగ్‌లను ప్రస్తుతం వైరలవుతున్నాయి. నేడు ఆత్మీయ సమావేశాలు పెట్టి నియోజకవర్గ అభివృద్ధి అంటూ సుద్దులు చెబుతుంటే స్థానిక ప్రజలే ఎమ్మెల్యేను అసహ్యించుకుంటున్నారు. నిన్నమొన్నటి వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని, ఇదంతా తన క్రెడిట్‌ అని శ్రీధర్‌రెడ్డి గొప్పలు చెప్పారు. నేడు మాత్రం అభివృద్ధి జరగలేదని చెబుతూ నవ్వులపాలవుతున్నారు.

'గిరి' చేరికకు ముహూర్తం ఖరారు

శ్రీధర్‌రెడ్డి రాజకీయ ఎత్తుగడలో భాగంగా తన సోదరుడు గిరిధర్‌రెడ్డిపై పచ్చకండువా కప్పించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఈనెల 24వ తేదీన మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో గిరి పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ముందుగా కండువా మార్చితే ఎమ్మెల్యే పదవి ఊడుతుందని భావించిన శ్రీధర్‌రెడ్డి తన సోదరుడిని చేర్పించి.. ఆ పార్టీ వ్యవహారాలు చూసుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడని ప్రచారం ఉంది. సార్వత్రిక ఎన్నికలకు ఆరునెలల ముందు ఎమ్మెల్యే టీడీపీలో చేరేలా ప్లాన్‌ చేసుకున్నాడని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. సోదరుడికి పార్టీ కండువా కప్పించి ఆయన ద్వారా టీడీపీ నెల్లూరు రూరల్‌ ఇన్‌చార్జిగా పెత్తనం చేయాలని చూస్తున్నట్లు తెలిసింది.

పక్కాగా పంట నష్టం వివరాల నమోదు



మాట్లాడుతున్న కలెక్టర్‌ చక్రధర్‌బాబు

- ఫ్లూ వైరస్‌ పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్‌ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్‌): జిల్లాలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలని వ్యవసాయ శాఖాధికారులను కలెక్టర్‌ కేవీఎన్‌ చక్రధర్‌బాబు ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన భవన్‌లో సోమవారం అన్ని శాఖల అధికారులతో వివిధ అంశాలపై కలెక్టర్‌ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు వేగంగా నివేదికను సిద్ధం చేసి ఇవ్వాలని తెలిపారు. దానిని ప్రభుత్వానికి పంపి రైతులకు అండగా నిలుస్తామన్నారు. ఇంకా పలు శాఖలకు చెందిన ఉద్యోగులు ఫేస్‌ రికగ్నిషన్‌ హాజరు వేయడం లేదన్నారు. ఇది తప్పనిసరి అని, వచ్చేనెల నుంచి పూర్తిగా ఆన్‌లైన్‌లో అనుసంధానం చేస్తారన్నారు. హెచ్‌3ఎన్‌2 ఫ్లూ వైరస్‌ వల్ల తీవ్రమైన దగ్గు, జలుబు, జ్వరం రోజుల తరబడి ఉంటుందని, అందువల్ల ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని, భౌతికదూరం సైతం పాటించాలని కోరారు.

వచ్చే నెల 15న గృహ ప్రవేశాలు

పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఈనెల 22వ తేదీన జరగాల్సిన గృహ ప్రవేశాలను ఏప్రిల్‌ 15వ తేదీకి మార్చినట్లు కలెక్టర్‌ తెలిపారు. ఈలోపు గృహ నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈనెల 25వ తేదీ ఆసరా వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. పొదుపు సభ్యులకు రుణ మాఫీని వర్తింపజేస్తామన్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ కేంద్రాలను పెట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్‌, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు, హౌసింగ్‌ పీడీ వెంకటదాసు, డీటీసీ చందర్‌, డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ పెంచలయ్య, జిల్లా రిజిస్ట్రార్‌ బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు

బ్యాంకు ఎదుట ఖాతాదారుల ఆందోళన

సోమశిల: బంగారు లోన్‌ రెన్యూవల్‌కు సంబంధించి ఇచ్చిన సొమ్మును అప్రైజర్‌ స్వాహా చేశాడని ఆరోపిస్తూ అనంతసాగరం కెనరా బ్యాంకు వద్ద ఖాతాదారులు సోమవారం ఆందోళనకు దిగారు. వారి కథనం మేరకు.. బ్యాంకు పరిధిలో ప్రతి ఏడాది ఆడిట్‌ నిర్వహిస్తారు. అయితే ఇటీవల కొన్ని బంగారు రుణాలు రెన్యూవల్‌ కాకపోవడం అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఆయా ఖాతాదారులకు నోటీసులు పంపారు. వారు బ్యాంక్‌కు వెళ్లి అధికారులతో మాట్లాడారు. తాము రెన్యూవల్‌ కోసం అప్రైజర్‌ ఎస్‌.భాస్కర్‌కు నగదు ఇచ్చామని చెప్పారు. ఇప్పటి వరకు రూ.3 లక్షల మేర తేడా ఉన్నట్లు మేనేజర్‌ డానియల్‌ వెల్లడించారు. నగదు స్వాహా విషయమై మేనేజర్‌ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. సోమవారం నెల్లూరు ప్రాంతీయ కార్యాలయం నుంచి అధికారులు వచ్చి సమగ్ర విచారణ చేపట్టారు. కాగా తాము రెన్యూవల్‌కు సంబంధించి నగదు కట్టినా నోటీసులు రావడంతో ఖాతాదారులు బ్యాంకు వద్ద ఆందోళన చేశారు. చెల్లించిన నగదుకు రసీదు ఉంటేనే బ్యాంకు జవాబుదారీతనంగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ విషయమై మేనేజర్‌ మాట్లాడుతూ అప్రైజర్‌ భాస్కర్‌ అందుబాటులో లేడన్నారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు.



బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

అటవీ భూముల పరిరక్షణకు చర్యలు

- కలెక్టర్‌ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్‌): జిల్లాలోని అటవీ భూములను పరిరక్షించడంతోపాటు వన్యప్రాణులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ కేవీఎన్‌ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన నెల్లూరులోని క్యాంప్‌ కార్యాలయంలో అటవీ శాఖ, పోలీసు, వన్యప్రాణి సంరక్షణ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ అటవీ భూములకు సంబంధించి రెవెన్యూ, అటవీ శాఖల అధికారుల మధ్య భూ వివాదాలు లేకుండా చూసుకోవాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎర్రచందనం అక్రమరవాణాను అడ్డుకోవాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు ప్రారంభించి వన్యప్రాణులకు హాని లేకుండా చూడాలన్నారు. మడ అడవులను కాపాడాలన్నారు. అవసరమైన చోట్ల సోలార్‌లైట్లు, రోడ్లపై స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా అటవీ ప్రాంతాల్లో నీటిని అందుబాటులో ఉంచి జంతువుల దాహార్తి తీర్చాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సంతాపం

ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు మృతి పట్ల కలెక్టర్‌ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావుతోపాటు అధికారులు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్‌ హరిత, కందుకూరు సబ్‌ కలెక్టర్‌ శోభిక, ఏఎస్పీ హిమవతి, అటవీ, పంచాయతీ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరో 11 మంది వీఏఏలపై చర్యలు?

కావలి: నియోజకవర్గంలో కొందరు గ్రామ వ్యవసాయ సహాయకులు గాడి తప్పారు. ఈ–క్రాప్‌లో పంటల నమోదు నుంచి ఎరువుల విక్రయాల వరకూ అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్నారు. పంటల నమోదులో అక్రమాలకు పాల్పడినందుకు గతేడాది 17 మందిని సస్పెండ్‌ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ–క్రాప్‌లో అక్రమాలకు పాల్పడిన మరో ముగ్గురిపై సస్పెన్షన్‌ వేటు పడింది. మరో 11 మందిపై కూడా చర్యలు తీసుకునేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఆర్బీకేల పరిధిలో మార్క్‌ఫెడ్‌ ద్వారా రైతులకు ఎరువులు విక్రయించి నగదు జమచేయకపోవడమే కారణమని చెబుతున్నారు. 11 మంది రూ.23 లక్షల మేర చెల్లించాల్సినట్లుగా లెక్కలు తేల్చారు. ఆ నగదు కట్టకుంటే చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది.

గుప్త నిధుల కోసం ఇంట్లో గోతులు

- 30 అడుగుల లోతు తవ్వి అన్వేషణ
- కాలువకట్ట పల్లిపాళెంలో ఘటన


ఇంటి ఆవరణలో తవ్విన గొయ్యిని పరిశీలిస్తున్న సీఐ తదితరులు

ఇందుకూరుపేట: ఓ వ్యక్తి అప్పులు తీర్చేందుకు డబ్బులు లేకపోవడంతో గుప్తనిధుల కోసం అన్వేషణ ప్రారంభించాడు. గుప్త నిధులు దొరికితే అప్పులు పోను విలాసవంతమైన జీవితం గడపాలని ఆశపడ్డాడు. లంకె బిందెల కోసం ఇంటి లోపల 30 అడుగుల గొయ్యి తవ్వాడు. అక్కడ ఏమీ దొరక్కపోవడంతో ఆ గొయ్యి పూడ్చేశాడు. మరలా ఇంటి ఆవరణలో ఉన్న వసారాలో ఇంకో గొయ్యి తవ్వాడు. అక్కడ కూడా ఏమీ లభించకపోవడంతో ఆ గొయ్యిని కూడా పూడ్చేశాడు. మళ్లీ ఇంటి ఆవరణలో ఇంకో గొయ్యి తవ్వేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో గ్రామస్తులు గమనించి ఆరా తీశారు. అతని ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఈ ఘటన ఇందుకూరుపేట మండలం కాలువకట్ట పల్లిపాళెంలో సోమవారం వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు కాలువకట్ట పల్లిపాళేనికి చెందిన లేబూరు వెంకటరమణయ్య గత కొంతకాలంగా రొయ్యల గుంతలు సాగు చేస్తూ సుమారు రూ.30 లక్షల మేర అప్పుల పాలయ్యాడు. ఏం చేయాలో దిక్కుతోచక కొందరు బయట వ్యక్తులను ఆశ్రయించి సాయం కోరాడు. 'నీ ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని, ఎవరికీ తెలియకుండా ఇంట్లో గొయ్యి తవ్వి గుప్త నిధుల కోసం అన్వేషించాలని' వారు సూచించారు. దీంతో వెంకటరమణయ్య ఇంట్లో, వసారాలో 30 అడుగుల మేర గోతులు తవ్వి లంకె బిందెల కోసం అన్వేషించాడు. రెండుచోట్ల ఏమీ దొరక్కపోవడంతో మరలా ఇంటి ఆవరణలో ఇంకో గొయ్యి తవ్వాడు. ఎవరికీ తెలియకుండా పూజలు చేయించే ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు ఈ పూజలను అడ్డుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి ఎస్సై వాసుతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వెంకటరమణయ్య తవ్విన గొయ్యిని పోలీసులు జేసీబీ సాయంతో పూడ్చి వేయించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొందరు స్వలాభం కోసం గుప్త నిధులు ఉన్నాయంటూ ఇలాంటివి చేస్తుంటారని, క్షుద్రపూజలు, లంకె బిందెల కోసం పూజలు చేస్తే కటకటపాలవుతారని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు జరిగితే తక్షణమే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

బాలిక అదృశ్యం.. గంటల్లో పట్టివేత

ఆత్మకూరు: తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో బాలిక ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్లిపోవడంతో కుటుంబసభ్యులు నెల్లూరు పోలీసులను ఆశ్రయించారు. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఆత్మకూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గంట వ్యవధిలోనే వారు ఆ బాలికను పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై శివశంకర్‌రావు వివరాల మేరకు కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ గ్రామానికి చెందిన బాలిక చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటోంది. తల్లిదండ్రులు పనులకు వెళ్లడంతో కిరాణా దుకాణానికి వెళుతున్నానని మేనత్తకు చెప్పి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్లిపోయింది. ఎంతసేపటికీ బాలిక రాకపోవడంతో ఆమె మేనత్త బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఆ బాలిక ఆత్మకూరు మార్గంలో వెళుతున్నట్లు గుర్తించి ఎస్సై శివశంకర్‌రావుకు సమాచారం ఇచ్చారు. వెంటనే దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి రోజారాణికి పోలీసులు సమాచారం తెలిపారు. ఆమె సూచనల మేరకు నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై పలు బస్సులను తనిఖీ చేసిన పోలీసులు, నెల్లూరుపాళెం వద్ద కడప బస్సులో వెళుతున్న బాలికను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వయం కృషి


జూట్‌బ్యాగుల తయారీలో నిమగ్నమైన మహిళలు

- జనపనార సంచుల తయారీలో నైపుణ్యం సాధించిన జరీనాబేగం
- కేవీకేలో శిక్షణ పొంది మరో ఆరుగురు మహిళలకు ఉపాధి
- మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు నగరానికి చెందిన ఎస్‌డీ జరీనాబేగం ఎమ్మెస్సీ వరకు చదివింది. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తే జీతం వస్తుందే తప్ప పది మందికి ఉపయోగపడే పనులు చేయలేమని భావించింది. తొలి నుంచి స్వయం కృషితో ఎదగాలని పట్టుదలగా పనిచేసేది. శ్రమనే పెట్టుబడిగా మలుచుకుని కష్టపడింది. 2014లో టైలరింగ్ శిక్షణను ప్రారంభించింది. కొంతమందికి టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేది. అనంతరం ప్రభుత్వ అనుబంధంగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో అనేక మందికి వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తుంటారని తెలుసుకుంది. అక్కడి శాస్త్రవేత్తలను కలిసి వారి ద్వారా కొంతకాలం జూట్‌బ్యాగుల(జనపనార సంచుల) తయారీలో శిక్షణ పొందింది. అనంతరం 2019లో కొంత పెట్టుబడితో నెల్లూరులోని దర్గామిట్టలో జూట్ బ్యాగులు తయారు చేసే కేంద్రాన్ని ప్రారంభించింది. మొదట ఇద్దరు మహిళలకు ఉపాధి కల్పించింది. వారు తయారు చేసిన జ్యూట్ బ్యాగులు నాణ్యతగా ఉండడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ వచ్చింది. ఇక అప్పటి నుంచి వ్యాపారాన్ని మరికొంత విస్తరించింది. ప్రస్తుతం ఆరుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తూ, శిక్షణ కూడా ఇస్తూ జూట్‌బ్యాగుల తయారీ, విక్రయాల వ్యాపారం నిర్వహిస్తోంది. వీరు ప్రతి రోజూ వివిధ సైజుల్లో 200 జ్యూట్‌బ్యాగుల వరకు తయారు చేస్తున్నారు. తద్వారా నెలకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వ్యాపారం జరుగుతుందని జరీనాబేగం తెలిపారు. స్వయం కృషితో తాను అభివృద్ధి చెందడమే కాకుండా మరికొందరు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషి చేస్తూ జరీనాబేగం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

శాస్త్రవేత్తల ప్రోత్సాహం మరువలేను



నేను ఉద్యోగం కన్నా స్వయం కృషితో వ్యాపారం చేస్తూ పది మందికి ఉపాధి కల్పించాలనే తలంపుతో ఉండేదాన్ని. గతంలో చిన్న టైలరింగ్ షాపు పెట్టుకుని శిక్షణ ఇచ్చేదాన్ని. కేవీకేలో ఇస్తున్న శిక్షణ నా జీవితంలో మార్పు తీసుకువచ్చింది. జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందాను. అక్కడి శాస్త్రవేత్తల ప్రోత్సాహం ఎప్పటికీ మరువలేను. వారి శిక్షణతోనే నేను ఈ స్థాయికి చేరాను.

– జరీనాబేగం, జూట్ బ్యాగుల తయారీదారు

దొడ్ల డెయిరీకి జాతీయస్థాయి భద్రతా అవార్డు

నెల్లూరు రూరల్: దేవరపాళెంలోని దొడ్ల డైయిరీకి జాతీయస్థాయి భద్రతా అవార్డు లభించినట్లు జనరల్ మేనేజర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం డెయిరీలో ఆయన విలేకరులకు అవార్డు వివరాలను వెల్లడించారు. జాతీయ భద్రతా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 17న గోవాలో జరిగిన కార్యక్రమంలో జాతీయ స్థాయిలో తమ డెయిరీ భద్రతా అవార్డును దక్కించుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. జాతీయ భద్రతా కౌన్సిల్ ప్రతినిధులు డెయిరీని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే అవార్డును ప్రకటించడం జరిగిందన్నారు. ప్రొడక్షన్ హెడ్ లక్ష్మణ్‌రెడ్డి, రీజనల్ హెచ్ఆర్ సుధాకర్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారని తెలిపారు.

రేషన్ బియ్యం పక్కదారి

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఏడో నంబర్ రేషన్ దుకాణాన్ని పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ మురళి సోమవారం తనిఖీ చేసి రేషన్ బియ్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దుకాణంలో అవకతవకలు జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదు అందిందన్నారు. దీంతో ఆకస్మికంగా తనిఖీ చేయగా 5,409 కేజీల బియ్యం లేవని గుర్తించామని, దుకాణ యజమాని కొరమగిరి కుమారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ విజయ్ ఉన్నారు.

నిమ్మధరలు (కిలో)	
పెద్దవి	: రూ.92
సన్నవి	: రూ.80
పండ్లు	: రూ.40

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్ (లైవ్)	: 98
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 180
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 200
లేయర్ చికెన్	: 128

మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ సీహెచ్ విజయారావు


అర్జీదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ విజయారావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే మోసగాళ్ల పట్ల నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సీహెచ్ విజయారావు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను చట్టప్రకారం విచారణ జరిపించి నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, అనుమానాస్పద మరణాల కేసులను అలసత్వం లేకుండా అన్ని కోణాల్లో దర్యాప్తు పూర్తి చేయాలని తెలిపారు. భూమి, సివిల్, కోర్టు పరిధిలో ఉన్న వివాదాలకు సంబంధించిన కేసులను న్యాయపరమైన(డీఎల్ఎస్ఏ) సలహాలు తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.3.53 కోట్లకు సిమెంట్ వ్యాపారి ఐపీ

కావలి: పట్టణంలోని మద్దూరుపాడుకు చెందిన సిమెంట్ వ్యాపారి అమాసాల రాజారమేష్‌బాబు రూ.3.53 కోట్లకు ఐపీ పెట్టినట్లు సోమవారం పలువురు బాధితులు వెల్లడించారు. ఈ మేరకు 44 మందికి కోర్టు ద్వారా నోటీసులు పంపినట్లు వాపోయారు. కావలి పట్టణంలోని ఆస్తులను బ్యాంకులకు, ఆర్థిక సంస్థలకు తనఖా పెట్టి అప్పులు తీసుకున్న రాజారమేష్‌బాబు, అవే ఆస్తులకు సంబంధించి ప్రైవేట్ వ్యక్తులకు స్టాంప్ పేపర్లపై రాసిచ్చి అప్పులు తీసుకున్నట్లు బాధితులు వాపోయారు. దీంతో అతనికి అప్పులు ఇచ్చిన ప్రైవేట్ వ్యక్తులు, ఆర్థిక సంస్థలు పరారైన వ్యాపారి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు.

పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

- డివిజనల్ సబ్ ట్రెజరీ ఏటీఓ మహ్మద్


ఏటీఓను సన్మానిస్తున్న పెన్షనర్స్

నెల్లూరు(బృందావనం): ఇప్పటివరకు పెన్షన్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల నుంచి మంగళ, బుధ వారాల్లో లైఫ్ సర్టిఫికెట్లు స్వీకరిస్తామని డివిజనల్ సబ్‌ట్రెజరీ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి(ఏటీఓ) షేక్ మహ్మద్ తెలిపారు. భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్స్ సంక్షేమ సంఘం భవనంలో సోమవారం జరిగిన స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ రెండు రోజుల్లో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించని పెన్షనర్స్‌కు మే నెల పెన్షన్ నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. ఈకేవైసీకి ప్రస్తుతం ఆఖరు తేదీ లేదని, అయినప్పటికీ పెన్షనర్స్ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. నెల్లూరులోని తమ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక సెల్‌లో ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు. అలాగే పెన్షనర్స్ సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అనంతరం స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎం.గౌస్, ఎస్పీవీఎస్ మూర్తి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏటీఓను సన్మానించారు. సమావేశంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.వేణుగోపాల్, అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ.రమణయ్య, కర్నూలు జిల్లా పెన్షనర్స్ సంఘం కోశాధికారి రాజారావు, జిల్లాలోని పెన్షనర్స్ పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

వెంకటాచలం: మండలంలోని కనుపూరు గ్రామానికి చెందిన మాసు నాగరాజుపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు అతని ఇంట్లోకి చొరబడి హత్యాయత్నం చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు మాసు నాగరాజు ఆదివారం రాత్రి తన ఇంట్లో ఉండగా, కనుపూరు గ్రామానికి చెందిన అక్షయ్, బాలు, పృథ్వీరాజ్ అతని ఇంట్లోకి చొరబడి కత్తులు, కర్రలతో దాడులు చేశాడు. నాగరాజు పెద్దగా కేకలు వేయడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ప్రత్యర్థుల దాడితో తీవ్రంగా గాయపడిన నాగరాజును కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రైలు పట్టాలపై తీవ్రగాయాలతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం నగరంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు నగరంలోని వేదాయపాళెం – నెల్లూరు రైల్వేస్టేషన్ల మధ్య ఎస్–2 సినిమా థియేటర్ సమీపంలో రైలు పట్టాలపై ఓ గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రగాయాలై మృతిచెందాడు. అతని వయసు 40 సంవత్సరాలు ఉంటుంది. నలుపు, గ్రే కలర్ ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లూ కలర్ జీన్స్ ఫ్యాంట్, క్రీం కలర్ ప్యారగాన్ చెప్పులు ధరించి ఉన్నాడు. అయితే ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో తీవ్రగాయాలై మృతిచెందాడా.. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణాల్లో రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.